క్లుప్తంగా

7న తైబజార్ వేలం

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ నెల 7వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయలు–పూజా సామగ్రి తదితర సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆలయంలో సంప్రదించాలన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజలో గిరిజన సంఘాల నాయకులు

మీర్‌పేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఠానునాయక్ విగ్రహ ఏర్పాటుకు చందన చెరువు కట్టపై గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఠానునాయక్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని తెలిపారు. మూడు వేల గ్రామాలకు విముక్తి కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇంద్రావత్ రవినాయక్, అనిల్‌యాదవ్, దీప్‌లాల్‌చౌహాన్, నీలా రవినాయక్, దశయనాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, నాయకులు రామ్‌లాల్, బన్సీలాల్, హమునాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

జంగారెడ్డికి కేఎల్‌ఆర్ శుభాకాంక్షలు



జంగారెడ్డితో కేఎల్‌ఆర్ తదితరులు

కందుకూరు: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు జంగారెడ్డితో కేక్ కట్ చేయించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

గంగమ్మకు మత్స్యకారుల పూజలు



పూజలు చేస్తున్న మత్స్యకార సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధి కొత్తగూడ సున్నం చెరువు పూర్తి స్థాయిలో నిండటంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాళ్ల నరసింహ ముదిరాజ్, పిట్టల శేఖర్‌ముదిరాజ్, తాళ్ల బాలేష్ ముదిరాజ్, శేఖర్, శ్రీశైలం, నరసింహ, కృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు

ఇబ్బంది పడుతున్న ప్రజలు



అంబేడ్కర్‌నగర్ రోడ్డు దుస్థితి

మీర్‌పేట: అభివృద్ధి పనుల పేరిట బాగున్న రోడ్డును తవ్వారు. అనంతరం మట్టితో పూడ్చి వదిలేశారు. దీంతో ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మీర్‌పేట జిల్లెలగూడ అంబేడ్కర్‌నగర్‌లో గతంలో డ్రైనేజీ పైపులైన్ పనుల నిమిత్తం రోడ్డును తవ్వి, పనులు పూర్తయ్యాక సంబంధిత కాంట్రాక్టర్ ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా.. వదిలేశారని స్థానికులు ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలనే మంచిగా ఉన్న రోడ్డు కాస్త.. అధ్వానంగా మారిందని పేర్కొంటున్నారు. తద్వారా ఇబ్బంది పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ భవ్య హాస్పిటల్, ఫణిగిరికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.



కందుకూరు: రాచులూరులో అమ్మవారి మండపం



కందుకూరులో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు

బాలాత్రిపుర, గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

- ప్రత్యేక పూజలందుకున్న దుర్గమ్మ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

మహేశ్వరం: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజున అమ్మవారు బాలాత్రిపుర సందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి, శివుడికి పూజలు చేశారు. సుప్రభాత సేవ, ఫల రసాభిషేకం, సహస్రనామార్చన, శ్రీబాలాత్రిపురసుందరి హోమం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, బాలాత్రిపుర సహస్రనామ కుంకుమార్చన, మహా మంగళహారతి, భజన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, డైరక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు. ఒగ్గు లావణ్య దంపతులు హోమం, తేలిజర్–మంగమ్మ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మురళీ కృష్ణ, ఆలయ డైరక్టర్లు ఎం.రాకేష్, ఎ.రాకేష్, ఎస్.కన్నయ్య, కె.జగన్, ఎ.సాయిలు, కె.శ్రీశైలం, అర్చకులు వీరేశం, రాజు, జగదీష్, చెన్న బస్వ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో రెండో రోజున అమ్మవారు.. గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: రాజరాజేశ్వర ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



తుక్కుగూడ: గాయత్రీ అలంకరణలో అమ్మవారు

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ఓనస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహా, సూచనల ప్రకారం నడుచుకోవాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి మించిన సంపద లేదన్నారు. రోజూ వ్యాయామం, వాకింగ్, యోగ ధ్యానం చేయాలన్నారు. ఓనస్ ఆస్పత్రి వారు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, రఘుపతి, నేనావత్ రాజు నాయక్, మురళీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి, సంగారెడ్డి, రవి నాయక్, సేవ్యా నాయక్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

బీజేపీ బలోపేతానికి కృషి

మీర్‌పేట: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి పేర్కొన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ 27వ డివిజన్ పరిధిలోని సిర్లాహిల్స్ కాలనీలో శుక్రవారం రాత్రి స్థానిక కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ఇంచార్జి సంజయ్ గుణాటి, అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ ఇంటింటికి తిరుగుతూ కాలనీవాసులచే సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదును విరివిగా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, రమేష్, చిల్లంపల్లి రాజశేఖర్, సత్యం, రుద్ర వెంకటేష్, కోట్ల గోపాల్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



సిర్లాహిల్స్ కాలనీలో సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మినీస్టేడియంలో బీఆర్‌ఎస్ నాయకుడు అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- రహదారుల నిర్మాణానికి పెద్దపీట



షాద్‌నగర్: వెలిజర్లలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామం నుంచి గొల్లకుంట తండా, జీడిగడ్డ తండాల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా సౌకర్యం సరిగా ఉంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. యాదయ్య యాదవ్, బాల్‌రాజ్ గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాడ్యాల నర్సింహ్మారెడ్డి, రాజు, జంగయ్య, తుప్పరి శేఖర్, గణేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని బల్లరాళ్ల తండా, తొమ్మిదిరేకుల గ్రామ శివారులోని బాలయ్య తండా బీటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో అండర్‌డ్రైనేజీ పనులు, జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల అధ్యక్షుడు గూడ వీరేష్, యాదయ్య యాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ సంబంధించి 33 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వెంకట్‌రెడ్డి, ఎం.క్రిష్ణారెడ్డి, సున్నపు వసంతం, ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, శంకర్, రాములు, పెంటయ్యగౌడ్, నరేందర్, పాండు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌ముదిరాజ్, సురేందర్, చెన్నయ్య, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

నేడు ఉపాధ్యాయ ఆత్మీయ సన్మానం..

మల్కాపూర్ సమీపంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని ఉపాధ్యాయుల ఆత్మీయ సన్మాన సదస్సు నిర్వహించనున్నట్లు, ఈ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య సభా ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహా, శ్రీధర్‌బాబు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, అధికారులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు.

పగలే వెలుగులు!

- విద్యుత్ వృథా
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామంలో రాత్రింబవళ్లు వీధి దీపాలు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బుధవారం బాకారం గ్రామంలో పగటి పూట వీధి దీపాలు వెలుగుతున్నాయని గ్రామస్తులు పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు వీధి దీపాలు వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతుందని చెబుతున్నారు. వీధిదీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఉన్నప్పటికీ, స్విచ్‌వేసి మరచిపోయి ఉంటారని వాపోయారు. ఇప్పటికైనా ఇలాంటి పొరపాట్లు జరగకుండా పైఅధికారులు స్పందించి పగటి పూట వెలిగే వీధిదీపాలను బంద్ చేయించాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.



కాశీంబౌలి వెళ్లే దారిలో వెలుగుతున్న వీధి లైట్

ఒకే రాష్ట్రం.. ఒకే కార్డు

- సమగ్ర సర్వేతో పేదలకు లబ్ధి
- డిజిటల్ కార్డు కోసం ఇంటింటి సర్వే
- పైలెట్ ప్రాజెక్టు కింద కొత్తూరులోని నాల్గో వార్డు, ఫరూఖ్‌నగర్‌లోని కడియాలకుంట తండా ఎంపిక
- క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

షాద్‌నగర్: సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఫ్యామిలీ డిజిటల్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిజిటల్ కార్డులను ఇచ్చేందుకు గాను ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించనుంది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద షాద్‌నగర్ పరిధిలోని కొత్తూరు మండలంలో ఒక వార్డు, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాల కుంట తండాను ఎంపిక చేసింది.

పైలెట్ ప్రాజెక్టు కింద తండా

ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డు ఇచ్చేందుకు గాను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద షాద్‌నగర్ పరిధిలో కొత్తూరు మున్సిపాలిటీలోని 4వ వార్డు, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండాను ఎంపిక చేసింది. కొత్తూరు మున్సిపాలిటీలోని నాల్గో వార్డులో మొత్తం 185 కుటుంబాలు ఉన్నాయి.మొత్తం జనాభా 1,042 ఉంటారు. అదే విధంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండా పరిధిలోకి రాయికల్ తండా, బూర్గుగడ్డ తండాలు వస్తాయి. కడియాలకుంట గ్రామ పంచాయితీ పరిధిలో మొత్తం 271 ఇళ్లు ఉన్నాయి. సుమారు 1006 మంది జనాభా నివసిస్తున్నారు. ఇందులో సుమారు 670 మంది ఓటర్లు ఉన్నారు. తండా పరిధిలో మొత్తం పది వార్డులు ఉన్నాయి.

ఇంటింటికి అధికారులు...

కుటుంబ డిజిటల్ కార్డుల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఒకే రాష్ట్రం, ఒకే కార్డు విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్, ఆరోగ్య సేవలతో పాటు, సంక్షేమ పథకాలన్నీ కుటుంబ డిజిటల్ కార్డు ద్వారా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి కుటుంబానికి ఒక ప్రత్యేక నంబర్‌తో కార్డు ఇవ్వనున్నారు. రేషన్ కార్డు, రైతు బంధు, పెన్షన్ తదితర సంక్షేమ పథకాల్లో డేటా ఆధారంగా ఇప్పటికే కుటుంబ సభ్యుల వివరాలను అధికారులు గుర్తించారు. ఇవి సరిగ్గా ఉన్నాయా ? లేవా? అన్న విషయాలను అధికారులు నిర్ధారించుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారుల బృందం పర్యటించి కొత్త సభ్యులను చేర్చడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, అదేవిధంగా కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్, కుటుంబ పెద్ద, యజమానికి మిగితా సభ్యుల మధ్య సంబంధాలు, కుటుంబ సభ్యుల ఫొటో వంటి వాటిని అధికారులు సేకరిస్తున్నారు. షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు ఆధ్వర్యంలో తహిసీల్దార్ల బృందం ఎంపికైన వార్డు, గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

ఐదు రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటన

పైలట్ ప్రాజెక్టును నియోజకవర్గ స్థాయిలో ఆర్డీవో పర్యవేక్షిస్తారు. ఐదు రోజుల పాటు అధికారులు గ్రామాల్లో పర్యటించి పూర్తి స్థాయిలో సేకరించనున్నారు.పైలట్ ప్రాజెక్టులో ఎదురయ్యే సానుకూలతలు, ఇబ్బందులను సమీక్షించుకొని మార్పులు, చేర్పులతో కుటుంబ కార్డులను ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుంది. గ్రామాల్లో అధికారులు ఈ నెల 7వ తేదీ వరకు పర్యటించి వివరాలు సేకరించనున్నారు.



పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కడియాలకుంట తండా



తండాలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

"కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నా



డిజిటల్ కార్డుల ప్రక్రియలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా కడియాలకుంట తండా ఎంపికైంది. కొత్తూరులోని నాల్గో వార్డుతో పాటు, కడియాలకుంట తండాల్లో అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– వెంకటమాధవరావు, ఆర్డీవో, షాద్‌నగర్